క్లుప్తంగా

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

కొత్తకోట: అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలని బీజేపీ దళిత మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన దళితులకు మాత్రమే దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దళితబంధు ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులందరికి దళితబంధు ఇచ్చేలా ఎమ్మెల్యే మనస్సు మారాలని కోరుతూ శనివారం పట్టణంలోని చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోటేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ భరత్‌భూషణ్, మన్యంయాదవ్, కొండన్న, ఎస్.వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భీమన్న, శివయాదవ్ తదితరులు ఉన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదివిన ఎండీ ముజామిల్ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఉమాదేవి తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థికి అభినందనలు తెలిపారు.

ఏఐసీసీ నేతలను కలిసిన డా.కేతూరి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి వాసి ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ డా. కేతూరి వెంకటేష్ రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ నేతలను కలిసి శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ముకుల వాస్నిక్‌తో పాటు పలువురి జాతీయ నాయకులను కలిసి పలు సమస్యలను విన్నవించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని, ఉదయ్‌పూర్ నవ సంకల్ప డిక్లరేషన్‌ను అమలు చేయాలని, పార్టీ తరఫున యువత, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పార్టీకి పనిచేసే వారికి తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

డెంగీపై అవగాహన

వనపర్తి: ఇంటి ఆవరణలో, పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్‌జీ కోరారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రవీందర్, హెల్త్ అసిస్టెంట్లు రాజు, శ్రీనివాసులు, రాము ఏఎన్ఎం సుమిత్ర, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో ఉన్న బీపీఆర్ గార్డెన్‌లో ఓ శుభకార్యానికి గద్వాల పట్టణానికి చెందిన అబ్దుల్ వహీద్ పల్సర్‌బైక్‌తో శుక్రవారం రాత్రి వచ్చాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి స్వస్థలానికి వెళ్లేందుకు బయటకు వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

వనపర్తి: అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లాలోని 10 వార్డు నాగవరం ప్రాంతంలో ఇంటింటికి అభివృద్ధి పనులు వివరించారు. మూడు దశాబ్దాలుగా చేయలేని పనులను ఐదేళ్ల కాలంలో పూర్తి చేసిన నాయకుడిగా వనపర్తి చరిత్రలో నిరంజన్‌రెడ్డి నిలిచిపోతారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, వనపర్తి పట్టణ ఇన్‌చార్జ్ అరుణ్‌ప్రకాష్, నాగవరం సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పుట్టపాగ మహేష్, బండారు కృష్ణ, నాయకులు నందిమల్లశ్యాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

25న బోనాల పండుగ

అమరచింత: మున్సిపల్ కేంద్రంలో ఈ నెల 25న పోచమ్మ దేవత బోనాల పండుగను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తాటికొండ రమేష్, మేస్త్రీ రాములు అన్నారు. శనివారం ఆలయ ఆవరణంలో బోనాల ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

రంగనాథస్వామిని దర్శించుకున్న గద్వాల డీఎం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం రంగనాథ స్వామిని శనివారం గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతం పలికి రంగనాథుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రామన్‌పాడులో 1,018 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,018 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటి విడుదల ఆపేశారు. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రఘునీల్‌రెడ్డి తెలిపారు.

సుందరీకరణ పనులు ప్రారంభం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో రహదారి విస్తరణ పనులు 90 శాతం పూర్తిచేసి రాకపోకల ఇబ్బందులను తొలగించినట్లు మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్ తెలిపారు. సెంట్రల్ మీడియన్ ప్లాంటేషన్ పనులను శనివారం అంబేడ్కర్ చౌక్‌లో వారు ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ప్రజల చిరకాల కోరిక తీర్చిన ఘనత మంత్రి నిరంజన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత పాలకులు రోడ్ల విస్తరణ పేరుతో ఓట్ల రాజకీయం చేస్తే.. ప్రజలకిచ్చిన హామీ మేరకు మంత్రి చేసి చూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ విక్రమసింహారెడ్డి, ఏఈ భాస్కర్, కౌన్సిలర్లు భువనేశ్వరి, పాకనాటి కృష్ణ, లక్ష్మీనారాయణ, నాగన్న, బండారి కృష్ణ, నాయకులు స్టార్ రహీం, శ్రీనివాసులు, శ్యాంకుమార్, గోపాల్, వినోద్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 కి.మీ. పొడవునా..

సెంట్రల్ మీడియన్ ప్లాంటేషన్‌లో భాగంగా 6 కి.మీ.ల పొడవున పొడవాటి ఆధునాతన జాతి చెట్లను రహదారి మధ్యలో నాటనున్నారు. వీటి ద్వారా రహదారులకు కొత్త సొబగులతో పాటు పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణం అందుతుంది. మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా చెట్లు తెప్పించారు. ఇందుకోసం టీఎఫ్ఐయూడీసీ కింద రూ.1.70 కోట్లు వెచ్చించారు. ఒక్కో చెట్టు 10 అడుగులు ఆపైబడి ఉంది. వీటిని క్రేన్ సాయంతో డివైడర్ పనులు పూర్తయిన ప్రాంతాల్లో పాతనున్నారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి సెయింట్ థామస్ స్కూల్, చిట్యాల రోడ్డు, డబుల్ బెడ్‌రూమ్ దారి వరకు, పాన్‌గల్ రోడ్డు నుంచి చౌడేశ్వరీదేవి ఆలయం వరకు, పాలిటెక్నిక్ కళాశాల నుంచి రామాలయం వరకు 6 కి.మీ. మేర చెట్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించినట్లు ఏఈ భాస్కర్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి సెయింట్ థామస్ స్కూల్ వరకు 3 కి.మీ. చెట్లను నాటాల్సి ఉండగా చల్మారెడ్డి హాస్పిటల్ నుంచి గాంధీచౌక్ వరకు, బాలానగర్ నుండి సెయింట్ థామస్ స్కూల్ వరకు పనులు కొనసాగుతుండటంతో ప్రస్తుతం వీలుపడదు. పానగల్ రోడ్డు నుంచి చౌడేశ్వరీదేవి ఆలయం వరకు కి.మీ. మేర చెట్లు నాటాల్సి ఉండగా.. అంబేడ్కర్‌చౌక్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు 20 చెట్లు నాటగా.. మిగతా ప్రాంతంలో పనులు కొనసాగుతుండటంతో సమయం పట్టనుంది. అంతేగాకుండా పాలిటెక్నిక్ కళాశాల నుంచి రామాలయం వరకు రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.

- సెంట్రల్ మీడియన్ ప్లాంటేషన్‌లో డేట్‌ఫామ్, రాయల్‌ఫామ్, పాక్‌స్టైల్, టర్మినాలియా చెట్లను 4 మీటర్లకు ఒకటి చొప్పున నాటనున్నారు. వీటి మధ్యలో 2 మీటర్ల దూరంలో పగోడా, పెలిషీయం చెట్లు ఏర్పాటు చేస్తారు. ఎడ్జ్ ప్లాంటేషన్‌కు అనువైన మొక్కలు తెప్పించారు. మరో వారం రోజుల్లో చెట్లు నాటే కార్యక్రమం పూర్తికానుంది.


అంబేడ్కర్ చౌక్ నుంచి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు నాటిన చెట్లు

నిలువు తోటలపై విద్యార్థులకు శిక్షణ

కొత్తకోట రూరల్: విద్యార్థులు అన్ని అంశాల్లో నైపుణ్యం పెంపొందించుకుంటే భవిష్యత్తు బాగుంటుందని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య అన్నారు. శనివారం పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలో కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులకు భారత వ్యవసాయ పరిశోధన మండలి, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద నిలువు తోటల పెంపకంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలపై విద్యార్థుల అవగాహన ఉండాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జీఎంఆర్ కంపెనీ ఏజీఎం విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నిలువు తోటలు ఎలా రూపొందించాలి, ఏవిధంగా ఉపయోగ పడుతాయో వివరించారు. కార్యక్రమంలో ఐకేఐజీఏఐ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌కే ఉమర్‌ముకీద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.గౌతమి, టి.బేబిరాణి, ఎస్సీ, ఎస్టీ విభాగం ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.నవ్య శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.


శిక్షణలో ఉద్యాన కళాశాల విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణానాయక్

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఈ నెల 18న నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యులు సామ్యానాయక్, మండల అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య, జిల్లా మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బాలీశ్వర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్మిక సంఘం అధ్యక్షుడు విక్రం, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు రాజులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్థానిక బాదం సరోజాదేవి కల్యాణ మండపం దగ్గర ఉదయం 7 గంటలను ఆత్మీయ సమ్మేళనం ప్రారంభమవుతుందని వివరించారు. వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ

పాన్‌గల్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచే విధంగా బోధన సాగాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నభోజనం, విద్యార్థుల సామర్థ్యాల, పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. విద్యా అభివృద్ధికి తల్లిదండ్రుల సూచనలను పాటిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం శివకుమార్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

బాధిత కుటుంబాలకు చిన్నారెడ్డి పరామర్శ

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీలో చుక్క రాములు తల్లి చుక్క నాగమ్మ, 2వ వార్డులోని మనోర్‌బాయ్ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆయా కాలనీలకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చుక్క నాగమ్మ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా 18వ వార్డుకు చెందిన మహ్మద్ అలీబాసా, నాగమ్మకు ప్రమాదాల్లో గాయపడటంతో వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు కమ్మర్ మియా, మత్స్యకార జిల్లా అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి. వెంకటేష్, రాములు, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు గంధం లక్ష్మయ్య, దిలీప్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

హైబ్రిడ్ ఆముదం విత్తనాల పంపిణీ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి రైతు వేదికలో క్లస్టర్ పరిధిలోని పలువురు రైతులకు మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం హైబ్రిడ్ ఐసీహెచ్–66 ఆముదం విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి హైబ్రిడ్ ఆముదం విత్తనాల సాగుపై సలహాలు సూచనలు చేశారు. అదేవిధంగా కోత సమయంలో తీసుకోవాల్సిన పద్ధతులను వివరించారు. కొత్త రకం ఐసీహెచ్–66 ఎండు తెగులుకు తట్టుకొని వర్షాధారంగా ఎకరాకు ఐదు క్వింటాళ్ల నుంచి ఆరు క్వింటాళ్ల వరకు, నీటి ఆధారంగా ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల వరకు వస్తుందని తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఆముదానికి, నూనెకు మంచి డిమాండ్ ఉందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చని పేర్కొన్నారు. ఏఈఓ మధు, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పామిరెడ్డిపల్లిలో విత్తనాలను అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి, సిబ్బంది

పిల్లల చదువుపై పర్యవేక్షణ అవసరం


మాట్లాడుతున్న హెచ్ఎం

పెబ్బేరు రూరల్: పిల్లల చదువుపై తల్లిదండ్రులు నిరంతర పర్యవేక్షణ చేయాలని హెచ్ఎం వరలక్ష్మి సూచించారు. శనివారం రంగాపురం మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందుతుందన్నారు. పాఠశాలలకు క్రమం తప్పకుండా పిల్లలను పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

కామ్రేడ్ సునీల్‌కు నివాళి

గోపాల్‌పేట: కామ్రేడ్ సునీల్ 12వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ శ్రీనివాసులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు ఆయన స్థూపం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం, కుల నిర్మూలనకోసం సునీల్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్ ఆంజనేయులు, జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కల్యాణ్, సుధాకర్, ప్రకాశ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వనపర్తిటౌన్: పెద్దగూడెం క్రాసింగ్ రోడ్డు వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల యజమానులు తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ రాజేందర్‌గౌడ్‌కు విన్నవించారు. ఈ మేరకు ఆయన బాధితులతో కలిసి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దగూడెం డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను పరిశీలించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గుర్తించారు. విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. తాగునీటి, వీధిలైట్ల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేందర్‌గౌడ్

ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

ఆత్మకూర్: ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తులసిరాజ్, జిల్లా కార్యదర్శి రహ్మతుల్లా అన్నారు. శనివారం మండలంలోని జూరాలలో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను పక్కదోవపట్టిస్తుందన్నారు. తొమ్మిదేళ్లు గడుస్తున్నా రైతులకు రుణమాఫీ చేయాలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, రూ. 4వేలు పింఛన్, రూ.500లకే సిలిండర్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగ, మధు, తదితరులు ఉన్నారు.


జూరాలలో ఇంటింటి ప్రచారంలో నాయకులు

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

కొత్తకోట: పట్టణ కేంద్రానికి చెందిన చాకలి కుర్మన్న కుమారుడు చాకలి బాలకృష్ణ అదృశ్యమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వివరాల ప్రకారం బాలకృష్ణ పాలెం సమీపంలో ఉన్న పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి ఆర్థికంగా నష్టపోయాడు. ఈ విషయం ఇంట్లో తెలవడంతో అతని తండ్రి అప్పులు తీర్చాడు. అయిన బెట్టింగ్‌లు మానుకోలేదు. మరోమారు నష్టపోవడంతో అవమానంగా భావించి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తాను చనిపోతున్నానని భార్యకు ఫోన్ ద్వారా మెస్సెజ్ పంపించాడు. కంగారు పడ్డ కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

తల్లిదండ్రుల సహకారంతోనే బడులు బలోపేతం

పాన్‌గల్: ప్రభుత్వ బడుల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని దావాజిపల్లి సర్పంచ్ వెంకటయ్యయాదవ్ అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ బడులల్లోనే నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందుతుందన్నారు. ప్రైవేటుకు దీటుగా ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని వివరించారు. అదేవిధంగా తెల్లరాళ్లపల్లి పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బద్రూనాయక్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటయ్యయాదవ్

బీసీ గర్జనకు తరలిరావాలి

పెబ్బేరు రూరల్: హైదరాబాద్ నిర్వహించే బీసీ గర్జనను విజయవంతం చేయాలని బీసీ ఐక్యవేదిక సభ్యులు కోరారు. శనివారం వనపర్తి మండలంలోని మెంటేపల్లి, కడుకుంట్ల, పెద్దగూడెం గ్రామాలను నాయకులు సందర్శించి ప్రజలను జాగృతం చేశారు. కాంగ్రెస్‌తోనే బీసీలకు సముచిత న్యాయం దగ్గుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక సభ్యులు పీసీసీ మాజీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ సతీష్‌యాదవ్, మహిళ మాజీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, కొండన్న, వెంకటయ్య, కురుమూర్తి, రొయ్యల రమేష్, సత్యనారాయణ కటిక రాజు, వెంకటస్వామి, తేజ, విష్ణు, నాగన్న తదితర నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక సభ్యులు

గోరింటాకు పండుగ

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం గోరింటాకు పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, ఉపాధ్యాయులు మెహందీ పెట్టుకొని సంబర పడ్డారు. కొత్తగా పాఠశాలలో చేరిన ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే ఏర్పాటు చేశారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలతి, విద్యార్థులు ఉన్నారు.

కొత్తకోట చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు



కొనసాగుతున్న కార్మికుల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. కొత్తకోటలో ర్యాలీ నిర్వహించారు. పెబ్బేరులో ధర్నా చేపట్టారు. ఖిల్లా ఘనపురంలో వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నాయకులు వారికి సంఘీభావం ప్రకటించారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ప్రమాదబీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్

వానలు పడాలని ప్రత్యేక పూజలు


శివుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, మహిళలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వెయ్యి టెంకాయల తీర్థ జలముతో శివుడి విగ్రహానికి అభిషేకం చేశారు. అతివృష్టి, అనావృష్టి లేకుండా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ఖిల్లాఘనపురం: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, తెలంగాణ మాడల్ పాఠశాల విద్యార్థులను క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఒక్కో విద్యార్థికి మెడల్‌తో పాటు రూ.1116 నగదును అందజేశారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ ఉషారాణి హాజరయ్యారు. క్లాస్‌మేట్ క్లబ్ మండల అధ్యక్షుడు విశ్వనాథంతో కలిసి ఆయా పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులకు వారు నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యంగౌడ్, రాజశేఖర్, సుధాకిరణ్, వాస రాఘవేందర్, , ఖిల్లాఘనపురం సర్పంచు వెంకటరమణ, నవీన్‌కుమార్, రాఘవేందర్, గోపాల్ మాడల్ పాఠశాల ప్రత్యేక అధికారి వాణికుమారి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన..

మదనాపురం: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని ఆత్మకూర్ మున్సిఫ్ కోర్టు జడ్జి శిరీష అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. బాల్యవివాహాలను తల్లిదండ్రులు పోత్సహించొద్దన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అశోక్‌కుమార్‌గౌడ్, హెచ్ఎం నిర్మల దేవి, పీఈటి రామచంద్రమ్మ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణాలకు విరాళం

పెబ్బేరు: మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని చెలిమిల్లలో గ్రామ దేవతల కర్రెమ్మ, పెద్దమ్మ, మశమ్మ దేవాలయాల నిర్మాణాలకు శనివారం వనపర్తి ఎంపీపీ మేఘారెడ్డి విరాళం అందజేశారు. గ్రామ దేవతల దేవాలయాలు నిర్మాణ దశలో పనులు నిలిచిపోవడంతో ఎంపీపీ స్పందించి రూ. 3 లక్షలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, వెంకట్రాములు, రమేష్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, రాములు, సాయిగౌడ్, గంధం అంజి, వెంకటరమణ, సతీష్‌కుమార్, తిరుపతన్న, వినయ్, జాంగీర్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

పెబ్బేరు రూరల్: పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 16 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సంకల్ప రథయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం తహసీల్దార్ రాజేందర్‌గౌడ్, సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి విడుదల చేశారు. వనపర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలంయ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 33 జిల్లాల గుండా టీఎస్ సీపీఎస్ ఈయూ సంకల్ప రథయాత్ర కొనసాగుతుందని వివరించారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సంఘం నాయకులు సాయిచందర్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తేనేటిరవి, మధు, సోని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.